# మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

■ ఆరోగ్య సూత్రాలు పాటిస్తే మేలు

- ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల వ్యాయామం చేయాలి
- తద్వార డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదు

రామాయంపేట రూరల్, డిసెంబర్ 19: చాలా మంది ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోరు. అంతా బాగానే ఉందనుకొని రోజువారీ బిజీ షెడ్యూల్‌లో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తుంటారు. కొన్నిసార్లు రోజూ ఉదయం 5 గంటలకు నిద్ర లేవాలని టైంటేబుల్ వేసుకుంటారు. కానీ, దానిని పాటించడానికి మాత్రం చాలా కష్టపడతారు. ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల వ్యాయామం చేయాల్సిందే. దీంతో డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం దాదాపు ఉండదు. దీనికి తోడు మరిన్ని ఆరోగ్య సూత్రాలను పాటిస్తే చాలు..



### వేడి నీటిని తాగాలి

ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేసుకోవడం ఎంతో మంచిది. అలాగే వేడి నీటిని తాగడం వల్ల బరువు తగ్గుతుంది. ప్రతిరోజూ కనీసం ఐదు లీటర్ల వరకు మంచి నీటిని తాగాలి. పెరట్లో లభించే తులసి ఆకులు నీటిలో కలిపి తాగడం శరీరానికి ఎంతో ఆరోగ్యం.

### యోగా

యోగాతో కలిగే లాభాలేమిటో అందరికీ తెలిసిందే. యోగా వల్ల శరీరం కాంతివంతమవుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. ఏకాగ్రత పెరుగుతుంది. బద్ధకం తగ్గుతుంది. రక్తం శుభ్రపడుతుంది. శరీర అవయవాలకు రక్త సరఫరా బాగా జరగడంతో ఆక్సిజన్ బాగా అందుతుంది. నాడీ మండలం, మెదడు చైతన్యవంతమై చురుగ్గా పనిచేస్తుంది. మంచి ఆకలి, ధైర్యం పెరుగుతుంది.





### అల్లం పైత్యానికి విరుగుడు

అజీర్ణ వ్యాధులకు అల్లం అద్భుతంగా పని చేస్తుంది. ఉదర సంబంధ వ్యాధుల నివారణకు అల్లాన్ని మించిన ఔషధం లేదని ఆయుర్వేదం గట్టిగా చెబుతోంది. వికారం, వాంతులు, విరోచనాలకు చెక్ పెడుతుంది. గర్భిణుల్లో వికారాన్ని, కీమోథెరపీతోపాటు ఎన్నో కారణాల వల్ల వచ్చే కడుపునొప్పిని అల్లం నివారిస్తోంది.

### లవంగాలతో శ్వాసకు మేలు

లవంగాలలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు దంతాలకు రక్షణ ఇస్తాయి. నోటిని, శ్వాసను తాజాగా ఉంచుతాయి. హృదయానికి ఆరోగ్యాన్ని ఇస్తాయి. యాంటిసెప్టిక్, యాంటీ బయోటిక్ ఔషధాల్లో లవంగాలను ఉపయోగిస్తారు.





### ఆవాలతో గుండెకు ఆరోగ్యం

ఆవాలు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరానికి కావల్సిన విటమిన్లు వీటిలో ఉన్నాయి. కీళ్లనొప్పులు, కండరాల నొప్పులను తగ్గిస్తాయి. శ్వాస అవరోధాలను దూరం చేస్తాయి.



### వెల్లుల్లితో అదుపులో రక్తపోటు

పచ్చి వెల్లుల్లి తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి కీళ్లనొప్పులను తగ్గిస్తాయి. ఆక్సీకరణ నుంచి శరీరంలోని కొవ్వును నివారించే కార్బొనోజెవిడ్ మిశ్రమ పదార్థాలు ఏర్పడే యాంటీ ఆక్సిడెంట్ ఇందులో మెండుగా ఉంటాయి.

### చక్కెరను నియంత్రించే దాల్చిన చెక్క

దాల్చిన చెక్కలో ప్రోటీన్లు, పీచు, ఐరన్ సోడియం, విటమిన్ సి ఇంకా ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. దీనిలోని ఔషధ విలువల వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇది రక్తంలోని చెక్కరస్థాయిపై ప్రభావం చూపుతుంది. అలాగే కొలాస్ట్రాల్, ట్రైగ్లిసెరైడ్ స్థాయిని తగ్గిస్తుందని డాక్టర్లు సైతం చెబుతున్నారు.



### నల్ల మిరియాలు



ఘాటుగా ఉండి నాలుకను చురుక్కమనిపించే మిరియాలు జీర్ణక్రియకు తోడ్పడుతాయి. ఆహారం తేలికగా జీర్ణం కావడానికి హైడ్రోక్లోరిక్ యాసిడ్‌ను విడుదల చేయమని ఉదరాన్ని ప్రేరేపిస్తాయి. బ్లాక్ కాఫీలో మిర్యాల పొడి వేసుకొని తాగితే రుతక్రమ సమయంలో ఇబ్బందుల నుంచి ఉపశమనం ఇస్తుంది.



### జీర్ణశక్తికి జీలకర్ర

జీలకర్రతో జీర్ణశక్తి పెరుగుతుంది. దీనిలోని క్యూమిడ్ డీహైడ్ అనే పరిమళం లాలాజల గ్రంథులను క్రియాశీలకంగా పనిచేసేటట్లు చేస్తాయి. ఆకలిని పుట్టిస్తుంది. శ్వాసక్రియ వ్యవస్థను ఎలాంటి అంటురోగాలు సోకకుండా ఆరోగ్యంగా ఉంచుతుంది.

### పచ్చి యాలకులు



ఊపిరితిత్తుల్లో కఫాన్ని కరిగించి శ్లేష్మాన్ని తొలిగించే శక్తి యాలకులకు ఉంది. శ్వాస సంబంధిత ఇబ్బందులతో బాధపడే పిల్లలకు యాలకులు వేసిన పాలను తాగించాలి. ఇది జీర్ణవ్యవస్థపై చక్కగా పని చేస్తుంది. అజీర్ణం, కడుపు ఉబ్బరాన్ని సంపూర్ణంగా తొలిగిస్తుంది.



సంగారెడ్డిలో పరుగుపందెం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న దివ్యాంగులు



సంగారెడ్డిలో బాలుడితో చెస్ ఆడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

# దివ్యాంగుల మనోధైర్యం గొప్పది



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

- ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడాపోటీలు
- సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 19 : సమాజంలో దివ్యాంగులు సకలాంగులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. దివ్యాంగులు మనోధైర్యం, ఆత్మస్థైర్యం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడాపోటీలను జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికూలతలను అధిగమిస్తూ అసమాన విజయాలను సాధించే దివ్యాంగులు ఎంతోమందికి స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తారన్నారు. జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటలపోటీల్లో శారీరక వైకల్య సమస్యలను అధిగమించి ఉత్సాహంగా పాల్గొంటున్న వారందరినీ అదనపు కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి, జిల్లా యువజన క్రీడల అధికారి రామచందర్‌రావు, డీఆర్డీవో అదనపు పీడీ సూర్యారావు, సీడీపీవోలు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, పీఈటీలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్యతోనే బంగారు భవిష్యత్

### విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి

- బోధనకు సాంకేతికత తోడైతే అద్భుత ఫలితాలు
- న్యాక్ చైర్మన్ హోసియార్ దామి
- ముగిసిన న్యాక్ బృందం సందర్శన



కళాశాలలోని డిజిటల్ లైబ్రరీని పరిశీలిస్తున్న న్యాక్ బృందం

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 19 : సమాజ నిర్మాణ బాధ్యత అధ్యాపకులదే అని న్యాక్ పీర్ టీం చైర్మన్ హోసియార్ దామి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వరుసగా రెండో రోజు మంగళవారం న్యాక్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా న్యాక్ టీం కళాశాలలో అందుబాటులో ఉన్న ఆధునిక పరికరాలను విద్యార్థులు ఏ విధంగా వినియోగించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. అంత కుముందు కళాశాల గ్రంథాలయాన్ని సందర్శించి అందులోని పుస్తకాలు,వార్తపత్రికలు, ఆన్‌లైన్ డిజిటల్ విధానాన్ని పరిశీలించారు. బోధన సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం హోసియార్ దామి మాట్లాడుతూ..కాలనుగుణంగా విద్యార్థుల భవిష్యత్ బాట లు వేసే మెరుగైన విద్యను అందించాలన్నారు.బోధనకు సాంకేతికత తోడైతే అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదే అని చెప్పారు. జాతీయ సమగ్రతకు కృషి చేయాలని బెనారస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బ్రజా భూషణ్ ఓజా అన్నారు.న్యాక్ టీం సభ్యుడు అయ్యాపిలై సెల్వమణి మాట్లాడుతూ..విద్యార్థులలోని నైపుణ్యాన్ని వెలికి తీయాలని సూచించారు.కళాశాలలో ప్రత్యేంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు మధుసూదన్, వాసం శ్రీనివాస్, గోపాల సుదర్శనం పాల్గొన్నారు.



బగలాముఖి శక్తిపీఠం ప్రహరీకి భూమిపూజ చేస్తున్న శక్తిపీఠం ట్రస్టు సభ్యులు

# త్వరలోనే శక్తిపీఠం ప్రహరీ పూర్తి

శివ్వంపేట, డిసెంబర్ 19 : మండల కేంద్రలోని శ్రీబగలాముఖి శక్తిపీఠం చుట్టూ ప్రహరీని త్వరలోనే పూర్తి చేస్తామని బగలాముఖి శక్తిపీఠం చైర్మన్, అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, శక్తిపీఠం స్థలదాత పబ్బరమేశ్‌గుప్తాలు అన్నారు. మంగళవారం వారు ప్రహరీ నిర్మాణానికి ట్రస్టు సభ్యులతో కలసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో శాస్త్రుల పురుషోత్తంశర్మ, అర్చకులు సంతోశ్‌శర్మ, ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు సూర్యం కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

### టేక్మాల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు భక్తుల వీరప్ప

టేక్మాల్, డిసెంబర్ 19 :ఇటీవల అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌పై పల్వంచ గ్రామానికి చెందిన భూమయ్య చేసిన తప్పుడు ఆరోపణలు నిజం కావని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఖండించారు. మంగళవారం మండలంలోని ప్రెస్ క్లబ్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు ఏడాది కాలంగా కాంగ్రెస్‌లోనే ఉంటూ నేడు ఎన్నికలైన తర్వాత మాజీ ఎమ్మెల్యే దళిత బంధు విషయంలో డబ్బులు తీసుకున్నాడంటూ సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఏడాది క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరి బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాడని గుర్తుచేశారు. ఇకపై నిరాధార ఆరోపణలు చేస్తూ అవాకులు, చవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే దామోదర్ మరికొందరు నాయకుల ప్రోద్బలంతో భూమయ్య ఇలాంటి ఆరోపణలు చేశారని, తమ నాయకుడిపై విమర్శలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. మండల ప్రధాన కార్యదర్శి అవినాష్, జిల్లా బీఆర్ఎస్ యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, పాల్వంచ సర్పంచ్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ సిద్ధన్న, సీనియర్ నాయకులు సలీం, చంద్రశేఖర్ రెడ్డి, సలావుద్దీన్, సత్యగౌడ్, గోవింద్ చారి, రవితో పాటు పల్వంచ గ్రామ దళిత బంధు లబ్ధిదారులు ఉన్నారు.

# లీగల్ ఎయిడ్‌తో న్యాయ సహాయం

### మెదక్ జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్

మెదక్ అర్బన్, డిసెంబర్ 19 : లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు ఇవ్వనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ తెలిపారు. మంగళవారం జిల్లా న్యాయస్థానం సముదాయంలో ప్యానెల్ లాయర్స్, లీగల్ ఎయిడ్ న్యాయవాదులకు విధులపై మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ ద్వారా బాధితులకు న్యాయ సహాయం అందించాలన్నారు. ఈ నెల 30 నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకునే కేసుల్లో రాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులను కక్షిదారులు కేసులను పరిష్కరించుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఏడుపాయలకు రూ.9.11 లక్షల ఆదాయం

వేలంలో వచ్చిన ఆదాయం



ఏడుపాయలలో టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం

పాపన్నపేట, డిసెంబర్ 19: ఏడుపాయల వన దుర్గా క్షేత్రంలో ఏడాదిపాటు ఎంటర్‌టైన్‌మెంట్ సామగ్రి విక్రయానికి నిర్వహించిన టెండర్ రూ.9.11 లక్షలకు ఖరారైంది. మంగళవారం ఈవో కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. భక్తులకు ఆహ్లాదకర వస్తువుల విక్రయం, ఎగ్జిబిషన్ ఏర్పాటు టెండర్‌ను రూ.9 లక్షల 11 వేలకు హైదరాబాద్‌కు చెందిన లిఖిత్‌కుమార్ దక్కించుకున్నారు. దేవస్థానం వద్ద కొబ్బరికాయలు విక్రయించుకునే హక్కు, ఒడి బియ్యం, కంకణధారణ, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునే హక్కు, దేవస్థానం వద్ద పూజా సామగ్రి విక్రయించుకునే హక్కులకు సరైన స్పందన రాకపోవడంతో వాటిని వాయిదా వేసినట్లు ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. ఈ వేలంలను తిరిగి ఈ నెల 23న నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మనోహర్, మోహన్‌రావు, సిద్ధిరాములు, వెంకటేశం, పెంటయ్య, సాయిలు, యాదగౌడ్, బాగా రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ శర్మ, లక్ష్మీనారాయణ, నరేశ్, మహేశ్, యాదగిరి, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# రైతు బిడ్డకు అభినందనల వెల్లువ



బిగ్‌బాస్ 7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌ను సన్మానిస్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్‌అర్బన్, డిసెంబర్19: బిగ్‌బాస్-7 రియాల్టీ షో విజేత పల్లవి ప్రశాంత్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఫోన్ ద్వారా అభినందించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. గజ్వేల్ మండలం కొల్గూరులో పుట్టిన ప్రశాంత్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతుబిడ్డగా గొప్ప పేరు తెచ్చుకోవడం గర్వంగా ఉందన్నారు. యూత్ ఐకాన్‌గా మారిన పల్లవి ప్రశాంత్‌ను, తల్లిదండ్రులను అభినందించారు. రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు మద్దిరాజిరెడ్డి, కొల్గూరు ఎంపీటీసీ జ్యోతీస్వామి, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, అహ్మద్, నరేశ్‌గౌడ్, నిజామొద్దీన్, పురం ఆంజనేయులు, కొండల్‌రెడ్డి, అనిల్, నరేశ్ పాల్గొన్నారు.

### ఎఫ్ఐఆర్ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

బిగ్‌బాస్-7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పల్లవి ప్రశాంత్ తరఫు హైకోర్టు న్యాయవాది రాజేశ్‌కుమార్ పోలీసులను కోరారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పల్లవి ప్రశాంత్ తల్లిదండ్రులు గొడుగు సత్యనారాయణ, విజయమ్మతో కలిసి న్యాయవాది విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిగ్‌బాస్ సీజన్-7లో విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్ పోలీసులు కేసు నమోదు చేయడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కాబట్టి వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే వాటిని పరిశీలించి తాము తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

# కండక్టర్ కుటుంబానికి అండగా ఆర్టీసీ

- రోడ్డు ప్రమాదంలో కండక్టర్ మృతి
- రూ.40 లక్షల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనర్, తదితరులు

మెదక్ అర్బన్, డిసెంబర్ 19 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కండక్టర్ కుటుంబానికి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భరోసా కల్పించింది. బాధిత కుటుంబానికి యూనియర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ.40 లక్షల ఆర్థిక సాయం అందించింది. నాలుగు నెలల క్రితం మెదక్ డిపోకు చెందిన కండక్టర్ సీహెచ్ అంజయ్య రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. మంగళవారం హైదరాబాద్ బస్ భవన్‌లో అంజయ్య కుటుంబానికి రూ.40 లక్షల విలువైన చెక్కును యూబీఐ అధికారులతో కలిసి టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అందజేశారు. దీంతో భార్య మణెమ్మతో పాటు కుమారుడు సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ రవీందర్,ఈడీలు కృష్ణకాంత్, పీవీ మునిశేఖర్, పురుషోత్తం, సీపీఎం ఉషాదేవి, యూబీఐ జనరల్ మేనేజర్ కృష్ణణ్, సిద్దిపేట రీజనల్ హెడ్ వికాస్, చీఫ్ మేనేజర్ రమేశ్, మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ పాల్గొన్నారు.